క్లుప్తంగా

పేకాట ఆడితే కఠిన చర్యలు

రేగోడ్(మెదక్): పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రాజయ్య శనివారం హెచ్చరించారు. పేకాట స్థావరాలపై సమాచారం అందిస్తే వారి పేరును గోప్యంగా ఉంచుతామని చెప్పారు. పేకాటపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో బెల్ట్ షాపులు నడిపితే కూడా పోలీస్ వారికి సమాచారం అందించాలని సూచించారు.

ఆలయంలో భక్తుల పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. దంపతులు సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. దాతల సాయంతో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు దేవదత్తశర్మ తదితరులు ఉన్నారు.

నగదు పట్టివేత



తనిఖీలో పట్టుకున్న నగదు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రం నిజాంపేటలోని నస్కల్ కమాన్ వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో నగదు పట్టుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. వాహనాలు తనిఖీలో హైదరాబాద్‌కు చెందిన కాసిరెడ్డి శ్రీధర్‌రెడ్డి రూ. 54 వేలు ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న నగదు పట్టుకున్నట్లు తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి రసీదు లేకుండా రూ. 50 వేల కంటే ఎక్కువ నగదును తీసుకెళ్లదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ జయపాల్ రెడ్డి, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

15న మండల సర్వసభ్య సమావేశం

పెద్దశంకరంపేట(మెదక్): ఈ నెల 15న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ జంగం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆమె కోరారు. సమావేశం ఉదయం 11 గంటల 30 నిమిషాలకు నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంతో పాటు అంబాజిపేట గ్రామంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు వాహనాలను తనిఖీ నిర్వహించారు. మెదక్ – చేగుంట ప్రధాన రహదారిపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలను టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు వేణుమాధవ్, గోపాల్, రాజు తదితరులు అధికారులు తనిఖీ చేశారు.

గజ్వేల్‌లో బీజేపీదే విజయం



పార్టీలో చేరిన వారితో ఈటల రాజేందర్

మర్కూక్(గజ్వేల్): గజ్వేల్ గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తుందని ఆపార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. శనివారం మండలంలోని పా తూరు, పాములపర్తికి చెందిన వివిధ పార్టీల నాయకులు మండల ఇన్‌చార్జి సింగం సత్తయ్య ఆధ్వర్యంలో ఈటల సమక్షంలో పార్టీలో చే రారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్తను కాపాడుకుంటానని హామీ ఇచ్చారు.

యథేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలు



నడిమితండా శివారులో అక్రమ మట్టి తవ్వకాలు

- ప్రభుత్వ ఆదాయానికి గండి
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

అల్లాదుర్గం(మెదక్): అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. రైతుల పట్టా భూముల్లో మట్టి తవ్వకాలు చేపడుతూ.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ లక్షలు సంపాదించుకుంటున్నారు. అక్రమ మట్టి తవ్వకాలతో పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడి వర్షాలతో నిండి ఎన్నో ప్రమాదాలు జరిగిన సంఘనలు ఉన్నాయి. అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. లక్ష రూపాయల కాంట్రాక్ట్ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ ప్రభుత్వానికి ఒక్క పైసా చెల్లించకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. శనివారం అల్లాదుర్గం శివారులో అక్రమ మట్టి తవ్వకాలు ప్రారంభించారు. బహిరన్‌దిబ్బ గ్రామ శివారు నుంచి చెవెళ్ల, పోతులబోగుడ వైపు వెళ్లే రహదారి పూర్తిగా పాడైపోయింది. ఈ రోడ్డు ప్యాచ్ పనులకు ఆర్‌అండ్‌బీ శాఖ 70 లక్షల రూపాయలు మంజూరు చేసింది. ఈ నిధులు మంజూరు చేసి మూడేళ్లు దాటినా.. పనులు ప్రారంభం కాలేదు. ఎన్నికలు ఉండటంతో కాంట్రాక్టర్ అనేక పనులు చేపడుతున్నారు. దీంతో ఆయన అనుమతులు లేకుండానే అక్రమ మట్టి తవ్వకాలు చేస్తున్నాడు. జేసీబీ, మూడు, నాలుగు టిప్పర్లు పెట్టి మట్టిని తరలిస్తున్నారు. మైనింగ్ అధికారుల అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారు. కార్యాలయాలకు సెలవు ఉన్న రోజే ఈ ప్రాంతంలో కొంత కాలంగా ఈ అక్రమ దందా కొనసాగుతోంది. మట్టి తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారుతున్నా చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. అధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ నితిన్‌ను రోడ్డు పనులకు ఎలాంటి అనుమతులు అవసరం లేదని చెప్పారు. తమ శాఖ డబ్బులు చెల్లిస్తుందని చెప్పుకొచ్చారు. అలాగే అల్లాదుర్గం రెవెన్యూ అధికారులను ప్రశ్నించగా.. అక్రమ మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టే వారిపై చర్యలతో పాటు వాహనాలు సీజ్ చేస్తామన్నారు. ఎలాంటి పనికి మట్టి తీసుకెళ్లినా.. కచ్చితంగా అనుమతులు తీసుకోవాలన్నారు.

గ్రామాల్లో దీపావళి సందడి

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా గ్రామాల్లో దీపావళి సందడి మొదలైంది. టపాసుల దుకాణాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. వీటితో పాటు దీపారాధనకు అవసరమైన సామగ్రి, పూలకు డిమాండ్ పెరిగింది. కిలో బంతిపూలు రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు.

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని మంజీరా విద్యాలయంలో శనివారం దీపావళి పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగవల్లులు వేయడంతో పాటు ప్రమిదలు వెలిగించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సురేశ్, కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రంగంపేటలో వెలిసిన టపాసుల దుకాణాలు



బంతిపూలు, దీపాల దుకాణాలు

కరెంట్ కోసం బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

చిన్నశంకరంపేట(మెదక్): రైతులకు నిరంతరం కరెంట్ అందిస్తున్న బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి కోరారు. శనివారం మండలంలోని జంగరాయి, చందాపూర్, మల్లుపల్లి, రుద్రారం, చందంపేట గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, ఏకే గంగాధర్‌రావు, కాంతారెడ్డి తరుపతిరెడ్డి, నందు జనార్దన్‌రెడ్డి, పట్లోరి రాజు, సర్పంచ్‌లు జ్యోతి, రమాదేవి, లక్ష్మణ్, శ్రీలత, ఎంపీటీసీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మల్లుపల్లిలో ఉద్రిక్తత...

మల్లుపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతుండగా.. కొందరు యువకులు తమకు బీసీ బంధు ఇవ్వలేదని ప్రశ్నిస్తూ దూసుకువచ్చారు. పోలీసులు వారిని ప్రచారానికి ఆటంకం కల్పించొద్దని పక్కకు తీసుకెళ్లారు.

క్రీడాకారిణికి అభినందన



శ్రీనికను అభినందిస్తున్న సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): అంతర్జాతీయ జూనియర్ టార్గెట్ బాల్ ప్రెసిడెంట్ కప్ పోటీలకు మండల పరిధిలోని చండి గ్రామానికి చెందిన విద్యార్థిని ఎంపికైంది. ఈ సందర్భంగా హైదరాబాదులో ఆమెను శనివారం నర్సాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉమా, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ వినోద, గ్రామస్తులు సంజీవచారి, నర్సారెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి ఉన్నారు.


అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని కొట్టాల, పాంపల్లి, దేవులపల్లి, మహ్మద్‌నగర్, ముట్రాజ్‌పల్లి తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం మండల వైద్యాధికారి శ్రీకాంత్ ఆదేశాలతో వైద్య సిబ్బంది, గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందుల పంపిణీ చేశారు. అవసరం ఉన్నవారికి వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చారు. రక్తహీనత నివారించేందుకు ఆహారంలో ఎక్కువగా పాలు, కోడిగుడ్లు, ఆకుకూరలు, పండ్లతో పాటు, రాగులు ఎక్కువగా తినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు మజీదా, రిబేకా, ప్రమీల, అంగన్‌వాడీ టీచర్‌లు రాజేశ్వరి, రాణి, అనురాధ, నాగరాణి, మహిళలు పాల్గొన్నారు.

మరమ్మతులకు మోక్షం ఎప్పుడు?



చెరువు కట్టపై రహదారిని కమ్మేసిన పొదలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట నుంచి సదాశివ నగరం మీదుగా కోనాపూర్‌కు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిని ఎక్కడికక్కడ గుంతలు పడి కంకర తేలింది. నాలుగు నెలల క్రితం మరమ్మతుల కోసం తారును తవ్వి వేసి వదిలేశారు. తారు లేచిపోయి కంకర తేలిన దారి ఓవైపు అయితే, రంగంపేట గ్రామ శివారు తురకల చెరువు కట్టపైన రహదారికి ఇరువైపులా ముళ్ల పొదలు దారిని కప్పి వేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొండపాక(గజ్వేల్): రోడ్డు పక్కన కూర్చున్న వృద్ధురాలిని కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. ఈసంఘటన కుకునూరుపల్లి మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. మండలంలోని బొబ్బాయిపల్లికి చెందిన కొమురవ్వ కుకునూరుపల్లిలో వంట సామగ్రి కొనుగోలు చేసేందుకు వెళ్లి రోడ్డు పక్కన కూర్చుంది. ఈక్రమంలో కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టెక్ చేయబోయి అదుపుతప్పి రోడ్డు పక్కన కూర్చున్న వృద్ధురాలిని ఢీకొట్టడంతో రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి.

రాజీవ్ రహదారిపై..

రాజీవ్ రహదారిపై బైక్ అదుపుతప్పి కిందపడడంతో యువకుడు గాయపడ్డాడు. ఈసంఘటన మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో శనివారం జరిగింది. చిన్నకోడూర్ మండలంలోని పెద్దకోడూర్‌కు చెందిన రాజు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈక్రమంలో పెద్దకోడూర్ నుంచి హైదారాబాద్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి కిందపడిపోవడంతో కుడి చేయి విరిగింది. 108 సిబ్బంది క్షతగాత్రుడిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లబ్ధిదారులకు 'డబుల్' తిప్పలు



డబుల్ బెడ్రూం ఇళ్లు

- మౌలిక వసతులు కల్పించని గుత్తేదారు
- ఏడాది గడుస్తున్నా పట్టించుకోని వైనం
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించి ఏడాది గడుస్తున్నా..మౌలిక వసతులకు సంబంధించిన పనులను పూర్తి చేయడంలో గుత్తేదారు నిర్లక్ష్యం వహిస్తున్నాడు. పనులు పూర్తికాకుండానే లబ్ధిదారులకు కేటాయించడంతో అందులో నివాసముంటున్న లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఇబ్బందులకు గురవుతున్న లబ్ధిదారులు..

వెల్దుర్తిలో 100 ఇళ్లు మంజూరు కాగా ఒకేచోట 36 సింగిల్‌గా, మరోచోట ఎనిమిది బ్లాక్‌లను నిర్మించారు. ఎనిమిది ఇళ్ల సమూహంగా ఉన్న ఒక బ్లాక్(హెచ్ బ్లాక్)లో ఏడాది గడుస్తున్నా నేటికీ పనులు పూర్తికాలేదు. హెచ్ బ్లాక్‌లో ఎనిమిది బ్లాక్‌లకు డోర్‌లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సౌకర్యం, వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేయకపోవడంతో ఆర్థిక స్తోమత ఉన్న ఒకరిద్దరు తమ సొంత డబ్బులు వెచ్చించి మెయిన్ డోర్‌లు ఏర్పాటు చేసుకున్నారు. మిగిలిన వారంతా ఎప్పుడు పూర్తి చేస్తారా అని ఎదురు చూస్తున్నారు. ఎనిమిది బ్లాక్‌లకు సంబంధించి ఏర్పాటు చేసిన డ్రైనేజీ సంపునకు పది మీటర్ల దూరం వరకు అండర్ డ్రైనేజీ నిర్మించినా కనెక్షన్ పూర్తి చేయలేదు. దీంతో డ్రైనేజీ పైపులు పూర్తిగా దెబ్బతినే పరిస్థితి నెలకొంది.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు..

డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద అసంపూర్తిగా చేపట్టిన పనులతో ఎదురవుతున్న ఇబ్బందులను సంబంధిత గుత్తేదారు, పంచాయతీరాజ్ అధికారులకు పలుమార్లు లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ పట్టించుకోకపోవడంతో విసుగుచెంది ఈ ఏడాది జూలై 14న వెల్దుర్తిలో పర్యటించిన కలెక్టర్ హరీశ్‌కు విన్నవించారు. దీంతో పనులను వెంటనే పూర్తి చేయాలని పీఆర్‌ఈఈ సత్యనారాయణరెడ్డి, డీఈ రాధికను ఆదేశించారు. పనులను సంబంధిత గుత్తేదారుతో పూర్తి చేయించాలని, లేనిపక్షంలో నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. అసంపూర్తి పనులపై కలెక్టర్ స్పందించి నాలుగు నెలలైనా నేటికీ పనులు పూర్తి చేయకపోవడంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పనులు పూర్తయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



కనెక్షన్ ఇవ్వకుండానే వదిలేసిన అండర్ డ్రైనేజీ పైప్‌లైన్

కేసీఆర్‌కు దూరంగా ప్రజలు

- గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్



కండువా కప్పుతున్న ఈటల రాజేందర్

మనోహరాబాద్(తూప్రాన్): గజ్వేల్ నియోజకవర్గంలో కేసీఆర్‌కు ప్రజలు దూరంగా ఉన్నారని, గజ్వేల్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. శనివారం మనోహరాబాద్ మండలంలో పలు గ్రామాలకు చెందిన నాయకులు బీజేపీలో చేరగా, వారికి ఈటల కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేసీఆర్ ఓటమికి ప్రతీ ఒక్కరు కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు మల్లేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు కమ్మరి నరేందర్‌చారి, నాయకులు కిరణ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

హ్యాట్రిక్ విజయం ఖాయం

మర్కూక్ (గజ్వేల్): ముచ్చటగా మూడోసారి గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. మండలంలోని పాములపర్తికి చెందిన వివిధ పార్టీల నాయకులు శనివారం మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, ఎంపీపీ పాండుగౌడ్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ గజ్వేల్‌లో ఎంతో అభివృద్ధి చేశారని మంత్రి కొనియాడారు.

సముచిత స్థానం కల్పిస్తాం

వర్గల్(గజ్వేల్): స్థానిక మండల పరిషత్ మాజీ వైస్ ఎంపీపీ, మజీద్‌పల్లికి చెందిన హజారి సుధాకర్‌రావు శనివారం గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలో సుధాకర్‌రావుకు సముచిత స్థానం ఉంటుందన్నారు. ఆయనతోపాటు కాంగ్రెస్‌లో చేరిన లక్ష్మణ్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, నేతలు రహీం, రాజు గౌడ్, సత్యం, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ములుగు(గజ్వేల్): మండలంలోని తున్కిబొల్లారంలో గజ్వేల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాబుగౌడ్, సభ్యుల ఆధ్వర్యంలో మేడ్చల్ మెడినోవా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 240 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నర్సింహారెడ్డి, కోశాధికారి శ్రీనివాస్‌గౌడ్, మాజీ అధ్యక్షులు కర్ణాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, జగదీశ్వర్, బాపురెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి, వైస్‌చైర్మన్ నరేష్‌గౌడ్, సర్పంచ్ పావని జగదీశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, ఎంపీటీసీ లింగారెడ్డి, సభ్యులు జమీల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **విశ్వరూప మహాసభకు తరలిన నాయకులు**



మనోహరాబాద్(తూప్రాన్): హైదరాబాద్‌లో మాదిగల సంక్షేమం కోసం మంద కృష్ణమాదిగ ఏర్పాటు చేసిన విశ్వరూప బహిరంగ మహా సభకు శనివారం మండలం నుంచి పలు గ్రామాల ఎమ్మార్పీఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్, కుమార్, ధర్మేశ్, మహేశ్, అశోక్, వేణుగోపాల్, యాదగిరి, నాగభూషణం, మధు, రామస్వామి, అరుణ్, శివ తదితరులు ఉన్నారు.

రామాయంపేట(మెదక్): పట్టణం పేట నుంచి పెద్ద సంఖ్యలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు సమితి జిల్లా అధ్యక్షుడు మల్యాల కిషన్ ఆధ్వర్యంలో విశ్వరూప సభకు తరలివెళ్లారు.

వెల్దుర్తి(తూప్రాన్): ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఆ సంఘం నాయకులు ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. వెళ్లిన వారిలో జాతీయ నాయకులు యాదగిరి, రాష్ట్ర నాయకులు శేఖులు, మాజీ సర్పంచ్ వెంకటేశం, మాదిగ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు లలిత, పరమేశ్, ఎర్రస్వామి తదితరులు ఉన్నారు.

◆ **బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం**

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్‌లు భూపతిరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, నాయకులు శేఖర్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని కొండాపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పురం మహేశ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ చింతల మమతరవి, ఉప సర్పంచ్ వెంకట్‌గౌడ్, నాయకులు రాము, సురేశ్, సత్యానారాయణగౌడ్, నర్సింగరావు, సత్యనారాయణ, పెంటాగౌడ్, తదితరులున్నారు. సీనియర్ నాయకుడు వెంకటనర్సింహారెడ్డి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

దంతేపల్లి గిరిజన తండాలో..

రామాయంపేట(మెదక్): మండలంలోని దంతేపల్లి గిరిజన తండాకు చెందిన ఇతర పార్టీలకు చెందిన యువకులు శనివారం మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ మేరకు ఆమె వారి మెడలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

◆ **రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి సర్వేశ్‌గౌడ్**

మనోహరాబాద్(తూప్రాన్): తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శిగా కాముగారి సర్వేశ్‌గౌడ్ నియమితులయ్యారు. శనివారం కాళ్లకల్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, ఆన్‌లైన్ పనులు, సోషల్ మీడియాలో చురుకుగా పని చేసినందుకు రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా తనను జాతీయ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జి సురభి, రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి నియమించినట్లు తెలిపారు. ఈ నియమానికి సహకరించిన డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రవణ్‌రావు, మండలాధ్యక్షుడు మల్లారెడ్డి, మాజీ గజ్వేల్ ప్రధాన కార్యదర్శి జోన్నోజీ నర్సింహచారిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

◆ **కాంగ్రెస్‌కు ఆదరణ**

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరిస్తున్నారని, బీఆర్‌ఎస్‌పై ప్రజలు విసుగుచెందారని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శనివారం మనోహరాబాద్ మండలంలోని కోనాయపల్లి(పీటీ)లో బీఆర్‌ఎస్ నాయకుడు మన్నే కల్యాణ్‌తో పాటు ఇద్దరు వార్డు సభ్యులు సత్యనారాయణ, రావెల్లి మహేశ్, 50 మంది నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి గ్రామంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. వీరి వెంట సిద్దిపేట యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంక్షారెడ్డి, మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నర్సింహచారి, సంతోశ్, అశోక్, సత్యనారాయణ, వెంకటేశ్, రాంచందర్, కృష్ణ, నాగరాజుగౌడ్, బానుయాదవ్, మన్నె రవీందర్, సుధాకర్, పవన్, శైలేందర్, ఆనంద్, రాముతో పాటు తదితరులు ఉన్నారు.